www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 43 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శుక్రవారం 29 - 05 - 2026


Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి
భారీగా వచ్చిన అభిమానులు

# చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు

- చంద్రయాన్-2 గుర్తింపు!
- ఏడేళ్లుగా పనిచేస్తున్న చంద్రయాన్-2 ఆర్బిటర్ ద్వారా కీలక డేటా సేకరణ
- అహ్మదాబాద్ పీఆర్ఎల్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి
- భవిష్యత్ యాత్రలకు ఇంధనంగా మారనున్న చంద్రుడిపై నీరు
- అమెరికా, చైనా వంటి దేశాల లూనార్ మిషన్లకు ఈ ఆవిష్కరణ కీలకం




**ఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుతమైన ఆవిష్కరణతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఏడేళ్ల క్రితం ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్‌లోని ఆర్బిటర్, చంద్రుని దక్షిణ ధ్రువంపై భారీగా భూగర్భ మంచు నిల్వలు ఉన్నట్లు బలమైన ఆధారాలను గుర్తించింది. ఈ ఆవిష్కరణ భవిష్యత్ అంతరిక్ష - మిగతా 2 లో

# ఎన్టీఆర్‌కు భారతరత్న

## మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

- తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అన్న చంద్రబాబు
- ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని వ్యాఖ్య
- తొమ్మిది నెలల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప ఎవరికీ సాధ్యం కాలేదన్న చంద్రబాబు




**అమరావతి :** చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని చెప్పారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి, దేశానికి విశేష సేవలు అందించిన ఎన్టీఆర్ కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని మహానాడులో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగానే మహిళలకు 33 శాతం సీట్ల ప్రకటనను నారా లోకేశ్ చేశారని - మిగతా 2 లో

## యువతకు అవకాశాల వెల్లువ..

# నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి

- జెన్-జీతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్న మంత్రి లోకేష్
- అవకాశాలకు అనుగుణంగా యువతను నైపుణ్య వనరులుగా తీర్చిదిద్దుతాం
- సోషల్ మీడియాలోని ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన
- విజయానికి దగ్గరి దారులు లేవని, కష్టపడితేనే ఫలితం ఉంటుందన్నారు
- యువత రాజకీయాల్లోకి రావాలని, టీడీపీ అవకాశాలు కల్పిస్తుందని పిలుపు



**అమరావతి :** యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగనిరతి వంటి గుణాలను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో "జెన్-జీ" యువతతో ఆయన ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు.రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు సాగుతోందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధన వనరుల వంటి రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు, వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లు ఏర్పాటవుతాయని, తద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) నిర్మితమవుతుందని అన్నారు. "రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తెచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తామన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం - మిగతా 2 లో


2 లో

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు

- జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది
- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పవన్ కల్యాణ్ నివాళి
- ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్ అని కొనియాడిన పవన్
- రూ.2కే కిలో బియ్యం పథకంతో పేదల ఆకలి తీర్చారని ప్రశంస

## కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి

# సిద్ధరామయ్య రాజీనామా

- సిద్ధరామయ్య భావోద్వేగ ప్రకటన
- అధిష్ఠానం ఆదేశాల మేరకే ఈ నిర్ణయమన్న సిద్ధూ
- గవర్నర్ కార్యాలయంలో రాజీనామా పత్రం సమర్పణ
- పొరపాటున రాజకీయాల్లోకి వచ్చానంటూ భావోద్వేగం



**బెంగళూరు :** కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది.ముఖ్యమంత్రి - మిగతా 2 లో

# అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా

- రీయూజబుల్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజిన్‌ను అభివృద్ధి చేసిన స్టార్టప్ 'అబ్యోమ్'
- అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించడంలో కీలక ముందడుగు
- ఈ స్టార్టప్‌కు బిట్స్ పిలానీ, ఐఐటీలు, ఇస్రో నుంచి మద్దతు

**హైదరాబాద్ :** భారత అంతరిక్ష రంగంలో హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ 'అబ్యోమ్ స్పేస్‌టెక్ ఒ డిఫెన్స్' ఒక కీలక మైలురాయిని అందుకుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రీయూజబుల్ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ ప్రకటించింది. ఈ విజయం, అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే సాంకేతికతలో భారత్ ముందడుగు వేయడానికి దోహదపడనుంది.కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ పరీక్షలు - మిగతా 2 లో

## మృత్యుశిఖరంలా ఎవరెస్ట్ మారుతోం


- ఎవరెస్ట్‌పై 8,000 మీటర్లు దాటాక 'డెత్ జోన్' ప్రారంభం
- ఆక్సిజన్ కొరతతో మెదడు, ఊపిరితిత్తులు విఫలమయ్యే ప్రమాదం
- ఈ సీజన్‌లో ఇద్దరు భారతీయులతో సహా ఐదుగురి మృతి
- శిఖరంపై రద్దీ పెరగడం మరణాలకు మరో ప్రధాన కారణం
- ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణుల హెచ్చరిక


2 లో

## కాజీపేటలో రైళ్ల తయారీ

# యూనిట్ పూర్తి కావొచ్చింది

- రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
- త్వరలో కాజీపేటలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని వెల్లడి
- రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందన్న మంత్రి
- ఇక్కడ తయారయ్యే రైళ్లను స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగిస్తామన్న మంత్రి



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను - మిగతా 2 లో

## రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!

- టీజీఐఐసీ వేలంలో రికార్డు ధర పలికిన ధర
- పాన్ మక్తాలోని సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల 29 గుంటలకు వేలం
- వేలంలో భూమిని దక్కించుకున్న గౌర వెంచర్స్


2 లో

## ఆధార్ తరహాలో

# యూనిక్ ఐడెంటిటీ నంబర్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు
- పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలన్న సీఎం
- ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా కార్డులు ఉండాలని సూచన
- ఆధార్ తరహాలో నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్న రేవంత్



**హైదరాబాద్ :** పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు.రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'భరోసా' భయాలు..!



భారత్ తన ఇంధన భద్రత గురించి భయపడనక్కరలేదు, ఎంత చమురు కొనాలనుకుంటే అంతా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం అంటూ అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రూబియో చేసిన వ్యాఖ్యలో, భరోసా కంటే బెదిరింపే ఎక్కువగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. రెండుదేశాల మధ్యా ఇంధన సహకారమే తన పర్యటనలో అత్యంత కీలకాంశమని ఆయన ముందే చెప్పివచ్చారు. తాము అమెరికా రికార్డుస్థాయిలో చమురు ఉత్పత్తి, ఎగుమతులు చేస్తున్నదని గుర్తుచేయడంతోపాటు, భారతదేశ ఇంధన దిగుమతుల్లో సింహభాగం తమదే కావాలని కూడా స్పష్టంచేశారు. తమతోపాటు, వెనెజువెలాకు కూడా అధికవాటా దక్కాలని కోరడమే కాక, ఆ దేశాధ్యక్షురాలు భారత్‌లో పర్యటించబోతున్న తరుణంలో, ఉభయదేశాలూ కలసి ముందుకు సాగాలన్నారు. డెల్సీ రోడ్రిగ్స్ పర్యటనను అటు వెనెజువెలా కానీ, ఇటు భారతదేశం కానీ ప్రకటించకుండా రూబియో నిర్ణయించడమేమిటని ప్రశ్నించిన కాంగ్రెస్, గత ఏడాది మే 10వతేదీ సాయంత్రం ఐదున్నరగంటలకు ఆపరేషన్ సిందూర్ నిలిపివేసినట్టుగా భారతప్రభుత్వం కంటే ముందు ఈయనే చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. భారతదేశానికి సంబంధించిన కీలక నిర్ణయాలు ముందుగా అమెరికాలో జరుగుతున్నాయా? అని కాంగ్రెస్ ప్రశ్న.చమురు లోటు తీవ్రంగా ఎదుర్కొంటున్న భారతదేశం తన దిగుమతుల జాబితాలో అమెరికా, వెనెజువెలాలను ప్రథమస్థానాల్లో నిలుపుకొని భారీగా కొనుగోళ్ళు జరపాలన్నది రూబియో మాటల సారాంశం. తాము ఆరంభించిన ఇరాన్ యుద్ధంతో భారత్‌లో ఏర్పడిన చమురు సంక్షోభాన్ని ఎలా పరిష్కరించుకోవాలో అమెరికాయే చెబుతోంది. వెనెజువెలా చమురుమీద ఆంక్షలతో భారత్‌ను గతంలో బెదిరించి, దిగుమతులకు మోకాలడ్డిన అమెరికా, ఇప్పుడు తానే స్వయంగా సేల్స్‌మ్యాన్ పాత్ర పోషిస్తోంది. జనవరిలో ఒక అర్థరాత్రి కుట్రలో నికోలస్ మదురోను ఎత్తుకుపోయి, ఆ స్థానంలో నమ్మినబంటును ప్రతిష్ఠించుకున్నాక, వెనెజువెలా చమురును అమెరికన్ కంపెనీలే 'డ్రిల్ బేబీ డ్రిల్' అని ఆడుతూ పాడుతూ తవ్వుకుంటున్నాయి, అమ్ముకుంటున్నాయి. అప్పటివరకూ ఈ పాపిష్ఠి చమురుమీద ఉన్న ఆంక్షలన్నీ ఒక్కసారిగా తొలగి, పెత్తనం అమెరికా చేతిలోకి పోయింది. పేరుకు మరోదేశమైనా సర్వాధికారం అమెరికాదే కనుక, ఆ కంపెనీల, వాటి లాభాల పరిరక్షణ ప్రధానం. ఇప్పటికే అమెరికా ఆంక్షలు, హెచ్చరికల దెబ్బకు రష్యా చమురు వెనుకపట్టుపట్టి మన దిగుమతుల్లో వెనెజువెలా ముందుకు వచ్చింది. మొన్నటివరకూ ఒక్కచుక్కా కొనుగోలుచేయని వెనెజువెలానుంచి రెండునెలలుగా భారీ దిగుమతులు సాగుతున్నాయి. రష్యానుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు రెట్టింపు సుంకాలతో మనను శిక్షించిన అమెరికా, ఆ తరువాత తాను ఆరంభించిన ఇరాన్ యుద్ధం కారణంగా తానే రష్యానుంచి కొనుగోళ్ళకు అనుమతులు ఇచ్చి, ఈ నెలలో మళ్ళీ తలుపులు మూసివేసింది. రష్యా బదులు వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందని ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు చెప్పిన ప్రకారంగానే అంతా జరుగుతోంది. రూబియో మార్గనిర్దేశనం ప్రకారం నడుచుకుంటే రేపటిరోజుల్లో అమెరికా, వెనెజువెలాలే మన ఇంధనభద్రతను నిర్ణయిస్తాయి.ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారతదేశం ఇంధనం కోసం ఏటా రమారమి 175 బిలియన్ డాలర్ల ధనం ఖర్చుచేస్తున్నది. పెట్రోడాలర్ ఆధిపత్యానికి వివిధ దేశాలు, కూటములనుంచి సవాళ్ళు ఎదురవుతున్న నేపథ్యంలో, మిత్రదేశమైన భారత్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు కాస్తంత మిగులు కూడా ఉన్నందున, భారత ఇంధన సరఫరాలను తన నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తోంది. ఘర్షణపడే ఉద్దేశం లేదని అంటూనే అమెరికా తాను చేయదల్చుకున్నది చేస్తోంది. ట్రంప్ విధానాలు కేవలం భారత్‌ను ఉద్దేశించినవి కావని అంటున్నప్పటికీ, ట్రంప్ మలిరాకడ తరువాత భారత్‌కు అన్నిరంగాల్లోనూ ఒనగూరిన నష్టం అపారమైనది. రష్యన్ చమురుమీద ఆంక్షలు, ప్రతీకార సుంకాలతో భారత ఎగుమతులను దెబ్బతీయడం, గ్రీన్ కార్డు, వీసా నియంత్రణలు, పాకిస్థాన్ ప్రాధాన్యం పెరగడం వంటి పరిణామాలు రూబియో ఎంత కాదన్నా నిజాలు కాకపోవు. ఐదువందల బిలియన్ డాలర్లు విలువచేసే అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలుకు సరేననేంతవరకూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌ను వదిలిపెట్టలేదు. మోదీ ఓ అద్భుతవ్యక్తి, ఆప్తమిత్రుడు అంటూనే ఖరీదైన అమెరికా, వెనెజువెలా చమురు భారత్‌కు అంటించేందుకు రంగం సిద్ధమవుతోంది.

# సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా



**మొదటిపేజీ తరువాయి -** సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు సిద్ధరామయ్య స్వయంగా వెల్లడించారు. అనంతరం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య కొంత భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు.తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

# మృత్యుశిఖరంలా ఎవరెస్ట్ మారుతోం



**మొదటిపేజీ తరువాయి -** అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం చాలామందికి ఒక కల. కానీ ఆ కలను నిజం చేసుకునే ప్రయాణంలో ప్రాణాలకే ముప్పు తెచ్చే ఒక ప్రమాదకరమైన ప్రదేశం ఉంది. అదే 'డెత్ జోన్'. సముద్ర మట్టానికి 8,000 మీటర్ల (26,247 అడుగుల) ఎత్తు దాటిన తర్వాత మొదలయ్యే ఈ ప్రాంతంలో, ప్రాణవాయువు కొరతతో మానవ శరీరం నిమిషనిమిషానికీ క్షీణించడం మొదలవుతుంది. ఈ ఏడాది (2026) సీజన్‌లో ఇద్దరు భారతీయ పర్వతారోహకులతో సహా కనీసం ఐదుగురు ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు.డెత్ జోన్‌లో గాలిలో ఆక్సిజన్ స్థాయి సముద్ర మట్టంతో పోలిస్తే కేవలం మూడో వంతు మాత్రమే ఉంటుంది. దీనివల్ల 'హైపోక్సియా' (ఆక్సిజన్ కొరత) ఏర్పడి, మొదట మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో గందరగోళం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, భ్రాంతులు కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సప్లిమెంటరీ ఆక్సిజన్ లేకుండా శిఖరంపైకి చేరితే, కేవలం 4 నిమిషాల్లో స్పృహ కోల్పోయి, 6 నిమిషాల్లో మరణం సంభవిస్తుంది. దీంతోపాటు మెదడు వాపు, ఊపిరితిత్తులలో నీరు చేరడం వంటి ప్రాణాంతక సమస్యలు కూడా తలెత్తుతాయి. శరీరం తనను తానే తినేస్తూ, కండరాలు బలహీనపడతాయి.ఇటీవల కాలంలో ఎవరెస్ట్‌పై రద్దీ విపరీతంగా పెరిగిపోవడం మరణాలకు మరో ప్రధాన కారణంగా మారింది. ఈ సీజన్‌లో నేపాల్ వైపు నుంచి ఒకేరోజు 274 మంది శిఖరాన్ని చేరుకున్నారు. ఈ రద్దీ వల్ల ప్రమాదకరమైన హిల్లరీ స్టెప్ వంటి ప్రాంతాల్లో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఇలా నిరీక్షించడం వల్ల శరీరం చల్లబడిపోవడమే కాకుండా, వెంట తెచ్చుకున్న ఆక్సిజన్ నిల్వలు కూడా వేగంగా అయిపోతున్నాయి.ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిఖరాన్ని చేరుకునేసరికే శక్తి మొత్తం అయిపోవడంతో, తిరుగు ప్రయాణంలో నీరసం, ఆక్సిజన్ కొరత కారణంగా చాలామంది కుప్పకూలుతున్నారు. ఈ ఏడాది మరణించిన ఇద్దరు భారతీయులు కూడా శిఖరాన్ని అధిరోహించి, కిందకు దిగివస్తుండగా ప్రాణాలు విడిచారు. డెత్ జోన్‌లో వీలైనంత తక్కువ సమయం గడపాలని, వాతావరణం అనుకూలించకపోతే వెనుదిరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి



**మొదటిపేజీ తరువాయి -** పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. "మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి," అని ఆయన యువతకు హితవు పలికారు.కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. "నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

# కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చింది



**మొదటిపేజీ తరువాయి -** తయారు చేస్తుందని అన్నారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు.గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని అన్నారు.

# చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు

**మొదటిపేజీ తరువాయి -** యాత్రల గతిని మార్చే కీలక పరిణామంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.2019లో చంద్రయాన్-2 ల్యాండర్ చంద్రుడిపై దిగడంలో విఫలమైనప్పటికీ, దాని ఆర్బిటర్ మాత్రం కక్ష్యలో తిరుగుతూ విలువైన సమాచారాన్ని పంపుతూనే ఉంది. తాజాగా, ఆర్బిటర్‌లోని 'డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' పంపిన డేటాను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. చంద్రుడిపై ఎన్నడూ సూర్యరశ్మి సోకని, అత్యంత శీతలంగా ఉండే శాశ్వత చీకటి ప్రాంతాల ఉపరితలం కింద ఈ మంచు నిల్వలు ఉన్నట్లు వారు నిర్ధారించారు. ముఖ్యంగా, ఫాస్టిని బేసిన్‌లోని ఒక బిలం కింద మంచు ఉనికికి బలమైన ఆధారాలు లభించాయని తెలిపారు.ఈ ఆవిష్కరణ అంతరిక్ష రేసులో వ్యూహాత్మకంగా భారత్‌కు గొప్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చంద్రుడిపై కనుగొన్న ఈ నీటి మంచును భవిష్యత్తులో తాగునీరుగా, శ్వాసకు అవసరమైన ఆక్సిజన్‌గా, రాకెట్లకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనంగా మార్చుకోవచ్చు. దీనివల్ల భూమి నుంచి ఇంధనాన్ని మోసుకెళ్లే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.ప్రస్తుతం అమెరికా, చైనా వంటి దేశాలు చంద్రుని దక్షిణ ధ్రువంపై స్థావరాలు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో, నీటి వనరులు ఎక్కడ ఉన్నాయో కచ్చితమైన సమాచారాన్ని అందించి భారత్ కీలక పాత్ర పోషించింది. చంద్రయాన్-3 విజయంతో పాటు, ఇప్పుడు చంద్రయాన్-2 అందించిన ఈ డేటా ప్రపంచ అంతరిక్ష సమాజానికి అత్యంత విలువైనదిగా మారింది.

## ఎన్టీఆర్‌కు భారతరత్న.మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

**మొదటిపేజీ తరువాయి -** చంద్రబాబు తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది టీడీపీ సిద్ధాంతమని... ఎన్టీఆర్ ఇచ్చిన ఆ సిద్ధాంతం శాశ్వతంగా కొనసాగుతుందని చెప్పారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప చరిత్రలో మరెవరికీ సాధ్యం కాలేదని అన్నారు. సినీ చరిత్రలో ఎన్టీఆర్ కు ప్రత్యామ్నాయం లేదని... ఆయన చేసిన పాత్రలు మళ్లీ చేయాలంటే ఆయనే మళ్లీ పుట్టాలని వ్యాఖ్యానించారు.

# అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించారు. ఈ విజయం, త్వరలో చేపట్టనున్న 'హోప్' (వర్టికల్ టేకాఫ్ అండ్ వర్టికల్ ల్యాండింగ్) అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్టుకు, అలాగే క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్షల్లో వాడిన ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్ సహా అన్ని పరికరాలను తమ ఇంజనీరింగ్ బృందమే దేశీయంగా తయారు చేసిందని అబ్యోమ్ వెల్లడించింది.ఈ విజయంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జైనుల్ అబిదీన్ మాట్లాడుతూ "భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థల నిర్మాణంలో ఈ పరీక్షలు చాలా కీలకం. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును భారీగా తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. తక్కువ ఖర్చుతో కూడిన రీయూజబుల్ స్పేస్‌ఫ్లైట్ కోసం టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తున్నాం" అని వివరించారు.బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఇంక్యుబేటర్ నుంచి అబ్యోమ్ స్టార్టప్ ప్రారంభమైంది. ఈ సంస్థకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేతో పాటు డీఎస్‌టీ, ఇస్రో, మెయిటీ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. రాబోయే రోజుల్లో రీయూజబుల్ రాకెట్ ప్రోటోటైప్ ప్రదర్శనలు, క్రయోజెనిక్ ఇంజిన్ల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు

**మొదటిపేజీ తరువాయి -** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు.ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్



**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు.ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు.ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్ ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు.కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు.ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

# సరికొత్త చరిత్ర..రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!



**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది.ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది.టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

అక్షర టైమ్స్

www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## తెలుగు జాతి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ చిరస్మరణీయం





**కాప్రా,మే28.అక్షర టైమ్స్:**-విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన వర్చువల్ "మహానాడు" కార్యక్రమంలో సాయి నాగార్జున పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి నాగార్జున మాట్లాడుతూ, ఎన్టీఆర్ పేరు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. సినీ రంగంలో అగ్రశిఖరాన్ని అధిరోహించిన ఆయన, రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజల కోసం సంక్షేమ పాలన అందించిన మహానేతగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలు చిరకాలం నిలవాలనే సంకల్పంతో తెలుగుదేశం పార్టీకి సాయి నాగార్జున లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ప్రజా సేవే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని, ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా మెగా బ్లడ్ క్యాంపు, మెగా హెల్త్ క్యాంపు

**శేరిలింగంపల్లి,మే28.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు 103 వ పుట్టినరోజు సందర్భంగా గోకుల్ ప్లాట్స్ మధుర బాంకెట్ హాల్లో ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ క్యాంప్ , హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మెగా క్యాంపు కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఏమ్ ఎల్ ఏ అరెకపూడి గాంధి,మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహనరావు,బండి రమేష్ , రాష్ట్ర నాయకులు మొవ్వ సత్యనారాయణ, మహా న్యూస్ సి.ఎం.డి మరెళ్ళ వంశి కృష్ణ , శేర్లింగంపల్లి జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ , మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి చంద్ర శేఖర్ రెడ్డి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ , హైదర్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు , ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్, గురుమూర్తి , గోనుగుంట్ల వెంకట్రావు , బండారు బాబు, కిలారు కోటి రాఘవులు, ఏం.నాగార్జున, జి.అభినాష్,జి.స్వాములు, కె. వెంకటేష్, మన్నె రాధాకృష్ణ, కె.రాంబాబు, ఏం జనార్ధన్, జే.శ్రీకాంత్,కె. రత్నం, కె.హరికృష్ణ,జి. అశోక్,కె.హనుమంతరావు, పాల్గొన్నారు.ఎన్టీఆర్



ట్రస్ట్ ఆధ్వర్యంలో, మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు . ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డిఎస్ఆర్కె ప్రసాద్, లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో 17 వ బ్లడ్ డొనేషన్,ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఆర్ ట్రస్ట్, మెడికవర్ హాస్పిటల్స్, హోలిస్టిక్ హాస్పిటల్స్, పాల్గొన్నాయి. సుమారు బ్లడ్ 411 యూనిట్స్ కలెక్ట్ చేయడం జరిగింది.దాదాపు 800 మంది వైద్య పరీక్షలు చేయించు కోవడం జరిగింది.అందరికి ఎన్ టి ఆర్ ట్రస్ట్ తరుపున సర్టిఫికెట్స్,ఎన్ టి ఆర్ 2026 క్యాలెండర్ మరియు కిట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టిఫిన్స్, బోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, సహకరించిన ప్రతి ఒక్కరికి, ఎన్ టి ఆర్ ట్రస్ట్ కి వారి సిబ్బంది కి,బాంక్వెస్ట్ హాల్ అధిపతి గోనుగుంట్ల వెంకట్రావు కి వారి సిబ్బంది కి, మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది కి, యాజమాన్యానికి, హోలిస్టిక్ హాస్పిటల్ సిబ్బంది కి, యాజమాన్యానికి, వైద్యులకు, ముఖ్యంగా ఆర్గనైజర్స్ అందరి, బ్లడ్ డోనర్స్ కి పేరు పేరున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియ చేసిన ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్.

## నాగారంలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



**నాగారం,మే28.అక్షర టైమ్స్:**-తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు నాగారం 5వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకురాలు కొండా సుజాత జంగా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం జయంతి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలు సమర్పించి ఆయన ప్రజాసేవ, పేదల పట్ల చూపిన కట్టుబాటు, తెలుగు ప్రజల గౌరవాన్ని ప్రపంచానికి చాటిన నాయకత్వాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమాశంకర్ గౌడ్, రంగారావు, కోటేశ్వరరావు, బ్రహ్మం చౌదరి, ఆంజనేయులు, రామయ్య, దుర్గప్ప, బాలాజీ చౌదరి, రంగారెడ్డి, నాగరాజుతో పాటు పలువురు పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ భేదాలకు అతీతంగా స్థానిక ప్రజలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయాల్లో సేవాభావానికి, ప్రజల సంక్షేమానికి ఎన్టీఆర్ చిరస్మరణీయ నాయకుడని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని కొనియాడారు.

## కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతి

**కాకినాడ,మే28.అక్షర టైమ్స్:**- తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత నాయకుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రివర్యులు చిక్కాల రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీకి సేవలందించిన పలువురు సీనియర్ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, సామాన్యుడిని అధికార కేంద్రానికి చేర్చిన ధీశాలి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయాల వల్లనే ఎంతో మంది సామాన్యులకు రాజకీయంగా గుర్తింపు, ఉన్నత పదవులు లభించాయని గుర్తుచేశారు. పేదవాడికి కూడు, గూడు, గుడ్డ





అందాలనే మహత్తర సంకల్పంతో ఎన్టీఆర్ పాలన సాగించారు. నాటి ఆయన ఆశయాలు, సిద్ధాంతాల స్ఫూర్తితోనే నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని నేతలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ చూపిన విలువలు, ప్రజాసేవా స్ఫూర్తి ఎక్కడా తగ్గకుండా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని, ఆయన ఆశయాల సాధనకే పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అల్లుమల్లు విజయ్ కుమార్, వాసిరెడ్డి చిట్టీబాబు, మల్లాడి గంగాధర్ తో పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొని ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## సహోదరత్వానికి,త్యాగానికి ప్రతీక బక్రీద్

- మాజీ కార్పొరేటర్ అమిత్ పటేల్



**కొండాపూర్,మే28.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** త్యాగానికి,భక్తి శ్రద్ధలకు నిదర్శనమైన బక్రీద్ పండుగను పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అమిత్ పటేల్ ముస్లిం సోదర సోదరీమణులకు, నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా డివిజన్‌లో శాంతిభద్రతలు, సామరస్యం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

**ప్రజల మద్దతుకు ప్రత్యేక కృతజ్ఞతలు**

ఈ సందర్భంగా అమిత్ పటేల్ మాట్లాడుతూ, కొండాపూర్ డివిజన్ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు, ఇస్తున్న మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పదవిలో ఉన్నా లేకపోయినా.. ప్రజా సేవలోనే తన సంతోషం ఉందన్న ఆయన, డివిజన్ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. "బక్రీద్ పండుగ మనకు త్యాగ నిరతిని, తోటివారికి సహాయం చేయాలనే గొప్ప సందేశాన్ని ఇస్తుంది. కులమతాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ఉంటూ కొండాపూర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం. ప్రజలు నాపై ఉంచిన నమ్మకానికి, అందిస్తున్న సహకారానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని అమిత్ పటేల్, మాజీ కార్పొరేటర్ శాంతి, సామరస్యాల కొండాపూర్

గంగా-జమునా తెహజీబ్ (మత సామరస్యం) సంస్కృతికి కొండాపూర్ డివిజన్ ఎప్పుడూ నిదర్శనంగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. పండుగలను అందరూ ఎంతో ఉత్సాహంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఈ ఈద్ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యాన్ని నింపాలని అమిత్ పటేల్ ఆకాంక్షించారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- మియాపూర్‌లో నివాళులర్పించిన జగదీశ్వర్ గౌడ్,ఉదయ్ కిరణ్

**శేరిలింగంపల్లి,మే28.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** తెలుగు జాతి గర్వకారణం, పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహానటుడు, దూరదృష్టి కలిగిన మహానేత డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. మియాపూర్ పరిధిలోని జేపీ నగర్, దీప్తి శ్రీనగర్ డివిజన్‌లలో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**విగ్రహాలకు పూలమాలలు - అన్నదాన కార్యక్రమాలు**

ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ మియాపూర్ యువ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన మహానేతను స్మరించుకుంటూ, ఈ సందర్భంగా స్థానికంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



**ఎన్టీఆర్ ఒక మహా విప్లవం'**

నాయకుల ప్రసంగం

ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ., ఎన్టీఆర్ సేవలను కొనియాడారు.

**తరతరాల స్ఫూర్తి:**

ఎన్టీఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాకుండా, ఓ మహా విప్లవమని, తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే మహనీయుడని పేర్కొన్నారు.

**చారిత్రాత్మక సంక్షేమ పథకాలు:**

మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, వికేంద్రీకృత పాలన అందించడం, పేదలకు గృహాల కల్పన మరియు రూ.2 కేజీల బియ్యం పథకం వంటి ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.

**నేటికీ మార్గదర్శకం:**

"సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతం నేటికీ సమాజానికి, రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. పాల్గొన్న ముఖ్య నాయకులు

ఈ భక్తిశ్రద్ధలతో కూడిన నివాళి కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో ముఖ్యులు:

మన్నేపల్లి సాంబశివరావు, కావూరి ప్రసాద్, కట్ల శేఖర్ రెడ్డి, సునీల్, గిరి, అశోక్,బాలకృష్ణ, కృష్ణ గౌడ్, శ్రీనివాస్, నాని, గురువులు, రాధాకృష్ణ, చారి, రామ్, వెంకటేష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొని ఎన్టీఆర్ గారికి ఘన నివాళులు అర్పించారు.

## సామాన్యుడికి అధికారం అందించిన మహానేత నందమూరి తారక రామారావు

- ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్

- అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ జీవితం అంకితం



**చర్లపల్లి,మే28.అక్షర టైమ్స్:**-సమాజంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ, సామాజిక అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత నందమూరి తారక రామారావు ఆశయాలు నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ అభ్యర్థి రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లిలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, ఆయన తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత అని కొనియాడారు. పేద ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి, సామాన్య ప్రజలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించారని పేర్కొన్నారు. మహిళలు, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన నాయకుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రజా సంక్షేమానికి కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడిగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ సత్యనారాయణ గౌడ్, ప్రేమ గౌడ్, కెకె రావు, రాగిరి నాధం, సత్యం యాదవ్, బీరప్ప, అశోక్ గౌడ్, పరమేశ్ గౌడ్, ఆటోగిరి సంజీవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక, త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ

పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

- ఎల్లమ్మబండ ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఆరెకపూడి గాంధీ,దొడ్ల వెంకటేష్ గౌడ్

ముస్లిం సోదర, సోదరీమణులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు

**శేరిలింగంపల్లి,మే28.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో పీఏసీ (గౌరవ) చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఆయన ప్రార్థనల్లో పాల్గొని, అక్కడ కూడిన ముస్లిం సోదర, సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగానికి, దైవభక్తికి నిదర్శనం ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ..బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు అని, అది అచంచలమైన దైవ భక్తికి, నిస్వార్థ త్యాగానికి నిదర్శనమని పేర్కొన్నారు. అల్లా పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అచంచలమైన విశ్వాసాన్ని స్మరించుకుంటూ



ముస్లింలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు."మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్రమైన పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని నేను అల్లాను ప్రార్థిస్తున్నాను. ముస్లిం సోదరులంతా ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి. ఆరెకపూడి గాంధీ పీఏసీ చైర్మన్ మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా ఈ పండుగను విజయవంతంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, వివిధ డివిజన్ల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వానికి,త్యాగానికి నిదర్శనం బక్రీద్

కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్





**శేరిలింగంపల్లి,మే28.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్ ఈద్గాలో బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అలనాడు ఇబ్రహీం అలైసలాం తన కుమారుడిని దైవమార్గంలో బలి ఇచ్చేందుకు ఉపక్రమించడం ఆయన త్యాగానికి పరాకాష్ట అని, ఆ మహోన్నత త్యాగాన్ని మననం చేసుకోవడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని కార్పొరేటర్ వివరించారు. శాంతి - సౌభ్రాతృత్వం బక్రీద్ పండుగ మానవత్వానికి, త్యాగానికి నిదర్శనమని సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.అందరూ సామరస్యంగా సోదరభావంతో ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.శేరిలింగంపల్లి డివిజన్ సర్వతోముఖాభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. "బక్రీద్ అంటేనే త్యాగం, ఐక్యతలకు ప్రతీక. సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని రాగం నాగేందర్ యాదవ్ కార్పొరేటర్ అన్నారు.పాల్గొన్న ముఖ్య నాయకులు, ప్రముఖులు ఈ వేడుకల్లో స్థానిక ముస్లిం పెద్దలతో పాటు పలువురు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.షైక్ గఫర్, జాకేర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, గఫుర్, ఎక్బాల్, షకీల్, అజామ్. యువజన సంఘాల ప్రతినిధులు: శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ముక్రమ్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా





**కాకినాడ,మే28.అక్షర టైమ్స్:-** జూన్ 1 వ తేదీన తుని మండలం చామవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా, ముందస్తు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో విస్తృతంగా సమీక్షించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే రూట్ మ్యాప్, సభా వేదిక, బారికేడ్ల నిర్మాణం మరియు ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లను నిశితంగా పరిశీలించి, అధికారులకు తగిన దిశానిర్దేశం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా కార్యక్రమంలో కాకినాడ (ఏ ఆర్) అడిషనల్ ఎస్ పి ఎస్. శ్రీనివాసరావు, ఎస్ బి డి ఎస్ పి శ్రీ కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పి ఏబిజీ తిలక్, కాకినాడ (ఏ ఆర్) డి ఎస్ పి వి జి శ్రీహరి రావులతో పాటు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అతివేగం ప్రమాదకరం - రహదారుల భద్రత పాటించండి

కోరుకొండ నార్త్ జోన్ డిఎస్పి జీవన



**గోకవరం,మే28.అక్షర టైమ్స్:-** వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకొండ నార్త్ జోన్ డిఎస్పి సిహెచ్ జీవన తెలిపారు. ప్రమాదకరమైన మలుపులలో వేగం తగ్గించి ప్రయాణించాలని సూచించారు. ఇందుకుగాను కొత్తపల్లి వద్ద ఇటీవల కాలంలో ప్రమాదానికి గురైన రోడ్డు మలుపు వద్ద ఇసుకతో కూడిన డ్రమ్ములను డి.ఎస్.పి ఏర్పాటు చేశారు .ప్రయాణం చేయాలని నిర్ణయించుకున్నప్పుడు ముందుగానే సమయం కేటాయించాలని ఆలస్యంగా బయలుదేరి కంగారు డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ పెట్టుకోవాలని, బైక్ మీద ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఆమె వాహనదారులను హెచ్చరించారు. ప్రాణం విలువ చాలా విలువైనదని అతివేగంతో కుటుంబాలలో విషాదాలు నింపుకోవద్దని డీఎస్పీ జీవన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తి, గోకవరం ఎస్ఐ పవన్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 'పంజా' సినిమా రీ-రిలీజ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**రాజానగరం,మే28.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ వారి జన్మదినాన్ని (సెప్టెంబర్ 2) పురస్కరించుకుని ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'పంజా' రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రాజానగరం కార్యాలయంలో చిత్రం యొక్క ప్రత్యేక పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

# జేఎన్టీయూకే లో ఎన్‌సీసీ క్యాడెట్లకు పోక్సో చట్టం, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీసులు





**కాకినాడ,మే28.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా ఇంచార్జి ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు, మహిళల భద్రతపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు కాకినాడ జేఎన్టీయూ, అల్యూమ్ని ఆడిటోరియంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ...పోక్సో చట్టం మరియు మహిళల భద్రత పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై అనూష, సర్పవరం ఎస్సై ఎన్. లక్ష్మణ స్వామి పాల్గొని క్యాడెట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ... సమాజంలో మహిళలు, బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్న పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) గురించిన నిబంధనలను, మహిళల భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రక్షణ మార్గాలను క్యాడెట్లకు వివరించారు. సమాజంలో క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీ క్యాడెట్లు మహిళల రక్షణలో, నూతన చట్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. మహిళలపై వేధింపులు, బాల్య వివాహాలు లేదా పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గమనించినా భయం లేకుండా స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయక నంబర్ 112 కు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడుతాయని తెలిపారు. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. శక్తి యాప్ ఉపయోగాలు తెలియజేసి అందరి మొబైల్స్ లో శక్తి యాప్ ఇన్స్టాల్ చేసుకుని, అత్యవసర సమయంలో పోలీసుల సహాయం కొరకు శక్తి యాప్ వినియోగించాలని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీ సీ గ్రూప్ కెప్టెన్ పి ప్రవీణ్ బాబు, శక్తి టీమ్ పోలీసులు, సుమారు 200 మంది ఎన్ సీ సీ క్యాడెట్లు హాజరయ్యారు.

# మునికూడలి పుష్కర ఘాట్‌ను 'మోడల్ ఘాట్'గా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ





**రాజానగరం,మే 28. అక్షర టైమ్స్:-** రాజానగరం నియోజకవర్గంలో రాబోయే పుష్కరాల ఏర్పాట్లు, ఘాట్ల అభివృద్ధి మరియు వేసవి కాలంలో నీటి సరఫరాపై రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ గురువారం రాజానగరం కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా ( ఆర్డబ్ల్యూఎస్) శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఉన్నతాధికారుల అనుమతి కోసం కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**మునికూడలి ఘాట్‌ను 'మోడల్ పుష్కర్ ఘాట్'గా అభివృద్ధి:**

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, మునికూడలి పుష్కర ఘాట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా 'మోడల్ పుష్కర్ ఘాట్'గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు, ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు.

**పుష్కర ఘాట్లలో యాత్రికులకు మెరుగైన సదుపాయాలు:**

నియోజకవర్గంలో ప్రతిపాదించిన 13 పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యంగా పుష్కర రేవుల వద్ద తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎక్కడా పారిశుధ్య లోపం తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఘాట్లలో తాగునీరు మరియు పారిశుధ్య సదుపాయాల కొరకు రూ. 4.52 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

రూ. 129 కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 1,535 సిసి (సీసీ ) డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు.

రూ. 7 కోట్లతో 'హై ఇంపాక్ట్' పథకం ( హై - ఇంపాక్ట్ ప్రాజెక్ట్ ) కింద వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు.

**వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యలు:**

రాబోయే వేసవి కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వెలుగుబంద, పరిజెల్లపేట, ఈస్ట్ గోనగూడెం, గాదరాడ వినాయకుని ఆలయం సెంటర్లలో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

# రాజానగరం నియోజకవర్గ ఆలయాల అభివృద్ధి, పుష్కరాల పనులపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విస్తృత స్థాయి సమీక్ష





**రాజానగరం,మే28.అక్షర టైమ్స్:-** రాజానగరం నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల సమగ్ర అభివృద్ధి, రానున్న పుష్కరాల పనులపై నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ దేవాదాయ (ఎండోమెంట్) శాఖ అధికారులతో గురువారం రాజానగరం కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పురాతన, ప్రముఖ ఆలయాల పునర్నిర్మాణం, భక్తులకు కల్పించాల్సిన కనీస సదుపాయాలపై అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ఈ సమావేశంలో చర్చించిన ముఖ్యమైన అంశాలు మరియు ఎమ్మెల్యే ఆదేశాలు:**

అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీ రంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు వెంటనే వేగవంతం చేయాలి.

**శ్రీవాణి పథకం కింద కొత్త ఆలయాలు:**

నియోజకవర్గంలో కొత్త గుడుల నిర్మాణం కోసం శ్రీవాణి పథకం కింద ఇప్పటికే 55 ప్రతిపాదనలను అందజేశాం. వీటికి సంబంధించిన నిధుల మంజూరు ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**కనుపూరు మల్లిఖార్జున స్వామి ఆలయం:**

కనుపూరు శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే డీపీఆ ర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ) సిద్ధమైంది. సి.జి.ఎఫ్ (సీజీఫ్ ) నిధులను వినియోగించి ఈ దేవాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరచాలి.

**కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం తక్షణమే విద్యుత్ సదుపాయం, వాటర్ ట్యాంక్, బోరు బావి మరియు వంటశాల (పోటు) అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, పనులను త్వరితగతిన ప్రారంభించాలి.

**దీపదూప నైవేద్యం పథకం:**

నియోజకవర్గంలోని చిన్న ఆలయాల అర్చకులకు అండగా నిలిచే దీపదూప నైవేద్యం పథకం కింద 63 దరఖాస్తులను అందజేయడం జరిగింది. ఈ దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి విచారణను (ఫీల్డ్ వెరిఫికేషన్ ) వేగవంతం చేసి, అర్హులకు త్వరగా న్యాయం చేయాలి.

**పుష్కరాల పనులు - ధ్వజస్తంభాల ఏర్పాటు:**

రానున్న పుష్కరాలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి మొదటి దశలో రూ.1.25 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటితో పాటు మరికొన్ని దేవాలయాలకు ధ్వజస్తంభాల ఏర్పాటు, ఇతర అత్యవసర పనుల ఆవశ్యకత ఉంది. ఆయా పనులకు సంబంధించిన అదనపు ప్రతిపాదనలను కూడా వెంటనే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి (ఇ.ఓ) సుబ్బారావు, డీ.ఇ.ఇ ఉదయ్ కుమార్, అన్నవరం దేవస్థానం అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణుని పాలెం ఎర్ర చెరువు కాలువ గట్టును పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ



**గోకవరం,మే28.అక్షర టైమ్స్:-** గోకవరం మండలం కృష్ణ పాలెం పంచాయితీ వెంకటాపురం ఎర్ర చెరువు కు సంబంధించి పంట కాలువ గట్టు బలహీనపడిన కారణంగా గండిపడి పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక రైతులు మండల బిజెపి అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర దృష్టికి తీసుకురాగా ఆయన గురువారం ఉదయం మండల ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి ఆయనను కాలువ గట్టు పరిశీలించడానికి రావలసిందిగా కోరగా ఆయన వచ్చి గట్టును పరిశీలించి దీనిపై పై అధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, ఉపాధ్యక్షులు మండిగ వెంకన్న దొర మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఈ గట్టుకు రక్షణ గోడ నిర్మించకపోతే గట్టు గండిపడి ఈ చెరువు ఆయుకట్టు క్రింద ఉన్న అనేక ఎకరాల పంట నీట మునిగి పోతుందని ఇది ఇక్కడి రైతాంగానికి జీవనాధారమైనటువంటి పంట పొలాలకు అతిపెద్ద సమస్య అని దీనిని మీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే నిధులు మంజూరు చేయించి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని ఇది ఇక్కడి రైతాంగం యొక్క అతి ప్రధానమైన సమస్యని దీనిని వెంటనే పరిష్కరించడానికి మీరు ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు ఉంగరాల ఆది విష్ణు స్థానిక రైతులు పాల్గొన్నారు

# బోనకల్ తహసీల్దారి కి నల్లగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతి



**బోనకల్,మే28.అక్షర టైమ్స్:-**బోనకల్ మండల తహసీల్దార్ విధులు నిర్వహిస్తున్న మద్దెల రమాదేవి, బుధవారం పదోన్నతి పొందారు. పదోన్నతిలో భాగంగా ఆమె నల్గొండలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించనున్నారు.బోనకల్ మండలంలో తహసిల్దార్ గా ఆమె సమన్వయంతో, బాధ్యతా యుతంగా విధులు నిర్వహిస్తూ పలువురి మన్న నలు పొందారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో వేగవం నిలిచారు.పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చారు. భూ సమస్యల సంబంధిత అంశాలు, రైతుల పాస్బుక్ సమస్యలు వంటి అనేక అంశాల్లో బాధ్యత గా వ్యవహరించి మండల ప్రజల ప్రశంసలు అందుకు న్నారు. ఆమెసేవలను పలువురు అభినందించారు. ఉన్నత బాధ్యతలు చేపడుతున్న ఆమె కు మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# బత్తిన వారి వివాహ వేడుకలో పాల్గొన్న జనసేన పార్టీ యువనాయకులు తోట పవన్





**కోరుకొండ,మే28.అక్షర టైమ్స్:-** కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలో ఘనంగా జరిగిన బత్తిన వెంకటేశ్వర్లు దుర్గ దంపతులు వారి కుమారుల వివాహ వేడుకలో పాల్గొన్నజనసేన పార్టీ యువ నాయకులు తోట పవన్ నూతన వధూవరులు "రాకేష్ - దివ్య" మరియు "ముకేశ్ - జ్యోతి" లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. వీరి వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపి సీనియర్ నాయకులకు ఘన సత్కారం



**గోకవరం,మే28.అక్షర టైమ్స్:-** టిడిపి ఆవిర్భావ నుండి ఇప్పటివరకు పార్టీ బలోపేతానికి కృషిచేసిన టిడిపి సీనియర్ నాయకులను గోకవరం క్లస్టర్ 1 ఇంచార్జ్, టిడిపి ప్రధాన కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కన్నబాబు ఘనంగా సన్మానించారు. 44వ మహానాడు కార్యక్రమంలో భాగంగా గోకవరం మండలం కృష్ణుని పాలెం గోపి కృష్ణ ఫంక్షన్ హాల్ నందు గోకవరం, కృష్ణుని పాలెం, తంటికొండ,గాదెలపాలెం ఇటికాయలపల్లి, గోపాలపురం, ఆర్ అండ్ ఆర్ కాలనీ టిడిపి నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఇటువంటి నాయకులను సన్మానించుకోవడమంటే మనలను మనమే సన్మానించుకున్నట్టుగా భావించాలని కన్నబాబు అన్నారు. ఎన్నో సంక్షోభాలను తట్టుకొని టిడిపి పార్టీ బలంగా నిలబడగలిగిందంటే బలమైన కార్యకర్తలు వెన్నుదన్నుగా నిలవడమేనని కన్నబాబు అన్నారు. మహానాడు కార్యక్రమంను క్లస్టర్ 1లో విజయవంతం చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజవర్గ స్థాయి, మండల స్థాయి నాయకులు ,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

### మాజీ మంత్రి కాకాణి





**పొదలకూరు,మే28.అక్షర టైమ్స్:**- రిపోర్టర్ ఆనంద్ : పొదలకూరు మండలం, పొదలకూరు, పొడమేకల కండ్రిగ, గ్రామాలలో గురువారం మాజీ మంత్రి ,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించారు.పొదలకూరు రాక సందర్భంగా బక్రీద్ పండుగను పురస్కరించుకొని పలు ముస్లిం కుటుంబాలు కాకాణిని కలిసి శుభాకాంక్షలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కూటమి పాలనపై భ్రమలు తొలగిపోయాయన్నారు. చంద్రబాబు డ్రామాలతో కాలక్షేపం చేస్తూ, తమను మోసగిస్తున్నాడని ప్రజలకు స్పష్టమైందన్నారు.మహానాడు పట్టుమని పదిమంది లేక, వెలవెల పోతుందంటేనే చంద్రబాబుపై ప్రజలలో వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు.కూటమి ప్రభుత్వంలో పాలన సాగిస్తున్న నాయకులందరూ పెత్తందారులుగా వ్యవహరిస్తున్నారు తప్ప, ప్రజా సేవకులన్న విషయం మర్చిపోయారన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ,కనీస వసతి సదుపాయాలు కల్పించకుండా, అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి, తమను ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు.కూటమి ప్రభుత్వంలో పాలకుల తీరును ప్రజలు తీవ్రంగా తప్పుపడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, ప్రజలకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు హామీలు ఇచ్చి మోసం చేయడం తప్ప, ప్రజలకు ఒరగపెట్టింది ఏమీ లేదన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో నేను మంత్రిగా, జగనన్న ముఖ్యమంత్రిగా, అనేక అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించామని పేర్కొన్నారు.ప్రజలకు ఎటువంటి భూ సమస్యలు లేకుండా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించామని తెలిపారు.అధికార పక్షం మాపై ఎన్ని రకాల పసలేని ఆరోపణలు చేసినా , ప్రజలే వారిపై విరచుకుపడుతున్నారన్నారు. గ్రామాలకు అవసరమైన రోడ్లు, సైడ్ కాలువలు, త్రాగునీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. గ్రామాలలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సాఫీగా, సమృద్ధిగా, సాగునీరందించామని తెలిపారు.ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, ఇళ్ల స్థలాలు లేనివారికి పట్టాలు అందించి , ఇళ్లు మంజూరు చేయించా మని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్ల నిర్మాణాన్ని అర్ధాంతరంగా ఆపివేసి , బిల్లులు చెల్లించకుండా పేదవాడి సొంత ఇంటి కల నెరవేరకుండా అడ్డుకున్నారన్నారు. జగనన్న పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలు పార్టీలకు అతీతంగా అందజేశామని పేర్కొన్నారు.ప్రజలు కూటమిపాలనపై విసిగి, వేసారి జగనన్న పాలన తిరిగి రావాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారన్నారు.అధికారంలో ఉన్నా ,అధికారం లేకపోయినా, ప్రజలకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అన్ని విధాలా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పొదలకూరు మండల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాచర్ల మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**రాచర్ల,మే28.అక్షర టైమ్స్:**- గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల గ్రామంలో స్పందన స్కూల్ లో ఏర్పాటు చేసిన మహానాడు సందర్భంగా క్లస్టర్ -6 లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.రాచర్ల మండలం నాయకులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గ పరిశీలకులు దశరథాచారి కి సాగర స్వాగతం పలికారు.ముందుగా ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నాయకులు కార్యకర్తలు, అభిమానులు అందరితో కలిసి కేక్ కట్ చేసి , ఎన్టీఆర్ విగ్రహం నకు పూల మాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు.మండల నాయకులు మహానాడు సందర్భంగా మండలం అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమలకు సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు, యువత, నిరుద్యోగులకు అండగా ఉందని ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని మరెన్నో పరిశ్రమలు తెచ్చారన్నారు.మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్ క్లస్టర్ ఇంచార్జ్ మూల వెంకట రామిరెడ్డి,మండల ప్రముఖులు నాయకులు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులకు ఎమ్మెల్యే శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా మండల నాయకులు , కుటుంబ సాధికార సభ్యులు , కార్యకర్తలు , అభిమానులు తదితరులు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గిద్దలూరు లో ఘనంగా బక్రీద్ వేడుకలు



**గిద్దలూరు,మే28.అక్షర టైమ్స్:**- మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని కొండపేట మసీద్ ఏ అబుల్ కసిం లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా జమాలుద్దీన్ రషీద్ బక్రీద్ పర్వదిన ప్రాముఖ్యతను వివరించారు. అల్లాహ్ ఆజ్ఞకు లోబడటం, త్యాగస్ఫూర్తి, సహనం మరియు పరస్పర సహకారం బక్రీద్ పండుగ ప్రధాన సందేశాలని ఆయన తెలిపారు. బక్రీద్ పండగ త్యాగాలకు ప్రత్యేకగా నిలిచే పండగ.ప్రతి ముస్లిం సోదరుడు సమాజ సేవాభావంతో ముందుకు సాగాలని, పేదలకు సహాయం చేయడం ద్వారా పండుగ యొక్క అసలు ఉద్దేశ్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికి ఒకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమం లో సయ్యద్. రసూల్, రఫీ, అబ్దుల్ రహిమాన్, ఖాజా హుస్సేన్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## కంభంలో పట్టపగలే నగదు,బంగారు చోరి



**కంభం,మే28.అక్షర టైమ్స్:**-మార్కాపురం జిల్లా కంభంపట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పందింటి రాజు అనే వ్యక్తి ఇంటిలో దొంగతనం జరిగింది తను విధులకు వెళ్ళినప్పుడు దొంగలు ఇంటిలోనికి రహస్యంగా ప్రవేశించి బీరువాను పగల గొట్టి అర తులం బంగారం మరియు పది తులాల వెండి ఇంకా 20వేల నగదు దొంగలు తీసుకెళ్లారని రాజు తెలిపాడు... దొంగలు దొంగతనం చేసిన తరువాత వెళుతూ వెళుతూ గ్యాస్ స్టవ్ లీక్ చేసి వెళ్లారని ఆయన తెలిపారు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్లూసు టీంని రంగంలోకి దిగి దర్యాప్తు చేస్తున్నారు

## జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ని కలిసిన బెల్లంకొండ సాయిబాబు



**గిద్దలూరు,మే28.అక్షర టైమ్స్:**-గిద్దలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బెల్లంకొండ సాయిబాబు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ని ఈ మధ్య రాజమండ్రి లో కలిశారు. బెల్లంకొండ సాయిబాబు గిద్దలూరు లోని రాజకీయ అంశాలను పవన్ కళ్యాణ్ తో చర్చించినట్లు సమాచారం. అదే విదంగా గిద్దలూరు నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో పార్టీ ని బలోపి తం చేయాలనీ పవన్ సూచించి నట్టు అలాగే త్వరలోనే నూతన పార్టీ కమిటీ లను ఏర్పాటు చేయనున్నట్లు పవన్ తనతో అన్నారని బెల్లంకొండ సాయిబాబా తెలిపారు.. సాయిబాబా తో పాటు గిద్దలూరు జనసేన నాయకులు కూడా పవను ని కలిశారు ఈమధ్య ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జనసేన పార్టీలో మార్పులు జరిగిన విషయం తెలిసినదే.వీరి భేటీ తో గిద్దలూరు నియోజకవర్గ ప్రజలలో పార్టీ లో ఏమి మార్పులు జరుగుతాయో అని ఆసక్తి నెలకొన్నది

## చెత్త మంటలతో చెలరేగిన ప్రమాదం 172 మొక్కజొన్న బస్తాలను కాపాడిన బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం

### - ఇంకెంతకాలం రోడ్ల పక్కనే పంటలు? - రైతుల ప్రాణాలతో చెలగాటం ఆపాలి"

### - అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ఆగ్రహం







**బోనకల్,మే28.అక్షర టైమ్స్:**-బోనకల్ -- వత్సవాయి ప్రధాన రహదారిలో గురువారం పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. రహదారి పక్కన ఉన్న పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించి సమీపంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న బస్తాల వరకు చేరుకున్నాయి. అక్కడ నిల్వ ఉంచిన సుమారు 172 మొక్కజొన్న బస్తాలు మంటలకు ఆహుతయ్యే పరిస్థితి నెలకొంది. సమయానికి మొక్కజొన్న పంట రైతు యార్లగడ్డ వెంకటేశ్వర్లు అక్కడ లేకపోవడంతో అతను భార్య వెంకటేశ్వర్లకు సమాచారం ఇవ్వగా వెంటనే బోనకల్ గ్రామ సర్పంచ్ జ్యోతి ఉప సర్పంచ్ బానోతు కొండకు మొక్కజొన్న పంట రైతు వెంకటేశ్వర్లు వెంటనే బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ కు పరిస్థితిని వివరించారు వెంటనే స్పందించిన బానోతు కొండ హుటాహుటిన గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే వాటర్ ట్యాంక్తో ఘటనాస్థలికి చేరుకుని సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో భారీ నష్టం తప్పి రైతు పంట సురక్షితంగా నిలిచింది.ఈ సందర్భంగా రైతు యార్లగడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "కొద్ది నిమిషాలు ఆలస్యమైతే మా ఏడాది శ్రమ బూడిదయ్యేదని , వెంటనే స్పందించి పంటను కాపాడిన ఉపసర్పంచ్ బానోతు కొండతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గానికి జీవితాంతం రుణపడి ఉంటాం" అని భావోద్వేగంగా తెలిపారు.ఘటన అనంతరం ఉపసర్పంచ్ బానోతు కొండ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, రహదారుల పక్కన మరియు పొలాల వద్ద నిల్వ ఉంచిన మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉంచాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం అన్నారు. ఎండలు, అగ్నిప్రమాదాలు, అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి. రైతు పంట రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అలాగే రహదారుల పక్కన చెత్తకు నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అజాగ్రత్త వల్ల రైతుల ఆస్తి నష్టం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు.

అగ్నికి హోహుతేనా కూరగాయల దుకాణం 20 వేలు అస్తి నష్టం మంటలు వ్యాపించి అక్కడే కూరగాయల దుకాణం ఏర్పాటు చేసుకున్న బోనకల్ గ్రామానికి చెందిన గంగుల సత్యం అనే వ్యాపారస్తుడి కూరగాయలు దుకాణం డబ్బా కొట్టు కూడా పూర్తిగా దద్దమైనట్లు సుమారుగా 20 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు ఆయన తెలిపారు. మంటల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించాలని ఉపసర్పంచ్ కొండ అధికారులను కోరారు.

**గతంలోను శ్రీ గంధం చెట్లు కాలిపోయాయి**

బోనకల్ గ్రామానికి చెందిన తెల్లాకుల శ్రీనివాసరావు కి సంబంధించిన శ్రీ గంధం చెట్లు ఇలాగే మంటలు వ్యాపించి కాలిపోయాయని వారికి కూడా తీవ్రంగా ఆస్తి నష్టం జరిగినట్లు వారు తెలిపారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, రైతు పంట భద్రతపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు





**ఒంగోలు,మే28.అక్షర టైమ్స్:**- తెలుగువారి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు 103 వ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్ లో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, బి.ఎన్.విజయకుమార్ లతో కలసి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుజాతి గౌరవాన్ని ఇనుమడింపజేసిన ఎన్.టి.రామారావు జయంతి వేడుకలను అధికారికంగా జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, నటనలో తన విశ్వరూపం చూపిన అన్న ఎన్టీర్ రాజకీయాలలోనూ తనదైన ముద్ర వేశారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల పాలిట పెన్నిధిగా నిలిచారన్నారు. అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్ పయనిస్తున్నారన్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా జరుపుకుంటునట్లు తెలిపారు. నందమూరి తారక రామారావు యుగపురుషుడు, సినీ రంగంలో రారాజుగా వెలుగొండిన వ్యక్తి, వారు రాజకీయాల్లో వచ్చిన తరువాత ఆనాటి పరిస్థితుల్లో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రెండు రూపాయలకే కిలో బియ్యం, మహిళలకు సమాన హక్కు కల్పించడం, పక్కా గృహల నిర్మాణాలు వంటి ఎన్నో పథకాలు ఈ రోజుకు అమలు జరుగుచున్నాయన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ పర్సన్ ఇంచార్జి డా కామేపల్లి సీతారామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచరిత్ర, ఒంగోలు మార్కెటింగ్ చైర్మన్ వెంకటరావు, మాజీ నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, స్టెప్ సిఈఓ శ్రీమన్నారాయణ పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చి క్యారెట్ వర్సెస్ ఉడికించిన క్యారెట్..

## ఏది బెస్ట్? ఇది తెలిస్తే మీ అభిప్రాయం మార్చుకుంటారు



ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ఇంట్లోనూ క్యారెట్లు నిత్యం వాడుకలో ఉండే ఒక కూరగాయ. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం అందించే క్యారెట్లను పచ్చిగా తింటే ఎక్కువ లాభమా, లేదా వండినవి తింటే ఎక్కువ ప్రయోజనమా అనే చర్చ తాజాగా మొదలైంది. జిమ్ ట్రైనర్ రాల్బన్ డిసౌజా చేసిన ఒక వైరల్ వీడియో ఈ సంభాషణకు తెర లేపింది. క్యారెట్లోని కీలక పోషకాలను శరీరం ఎలా గ్రహిస్తుంది? పచ్చివి, వండినవి రెండింటిలో ఏది ఉత్తమం? వంటి అంశాలపై ఇప్పుడు లోతుగా పరిశీలిద్దాం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఇంట్లోనూ క్యారెట్లు ఒక ప్రధాన ఆహార పదార్థం. అవి రుచిని, పోషకాలను అందిస్తాయి. పచ్చిగా తిన్నా, వండినా అవి పోషకమైనవే. అయితే, క్యారెట్ల ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందడానికి వాటిని ఎలా తినాలి? పచ్చి క్యారెట్లు ఆరోగ్యకరమా, వండినవి ఆరోగ్యకరమా అనే అంశంపై జిమ్ ట్రైనర్ రాల్బన్ డిసౌజా విడుదల చేసిన కొత్త వీడియో ఒక ఆసక్తికరమైన చర్చను లేవనెత్తింది.

### పచ్చిదా.. వండినదా.. ఏది తినాలి?

క్యారెట్లలో బీటా-కెరోటిన్ ఉంటుంది, ఇది శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. విటమిన్ ఎ కళ్ళకు, రోగనిరోధక వ్యవస్థకు, చర్మానికి ముఖ్యమైన పోషకం. అయితే, డిసౌజా గుర్తుచేసినట్లుగా, మీరు పచ్చి క్యారెట్లను తిన్నప్పుడు, మీ శరీరం కేవలం 3 నుండి 4 శాతం బీటా-కెరోటిన్ను మాత్రమే గ్రహిస్తుంది. అయితే, క్యారెట్లను వండటం వల్ల బీటా-కెరోటిన్ శోషణ దాదాపు 40 శాతం వరకు పెరుగుతుంది. అంటే, క్యారెట్లను ఆవిరి పట్టడం, ఉడికించడం లేదా పాన్-ఫ్రై చేయడం ద్వారా వాటిని మరింత ఆరోగ్యకరంగా మార్చవచ్చు. విటమిన్ ఎ కొవ్వులో కరిగేది కాబట్టి, అది శరీరానికి సులభంగా అందడానికి వండిన క్యారెట్లకు కొద్దిగా నెయ్యి లేదా నూనెను జోడించమని కూడా ఆయన సిఫార్సు చేస్తున్నారు.

### క్యారెట్ వివాదంపై నెటిజన్ల స్పందన

ఈ చర్చ ఇప్పుడు సోషల్ మీడియాకు విస్తరించింది, చాలా మంది తమ అభిప్రాయాలను పచ్చి క్యారెట్లు లేదా వండిన క్యారెట్లను తినే ఉత్తమ పద్ధతిపై పోస్ట్ చేస్తున్నారు. కొందరు వినియోగదారులు పచ్చి క్యారెట్లను క్రంచీగా, రుచికరమైన స్నాక్గా ఇష్టపడుతున్నామని పేర్కొన్నారు. మరికొందరు క్లాసిక్ వంటకాలైన సబ్జీలు, ఖిచిడి వంటి వాటిలో వండిన క్యారెట్లను ప్రధానంగా ఉపయోగిస్తారని ఎత్తి చూపారు. ఒక వినియోగదారుడు అయితే, ఇది 'గాజర్ కా హల్వా'ను ఆస్వాదించడానికి మరో సాకు అని సరదాగా వ్యాఖ్యానించారు.

### పచ్చి క్యారెట్లు లేదా వండినవి ఏవి తినాలి?

పచ్చివి, వండిన క్యారెట్లకు వాటికవే ప్రయోజనాలు ఉన్నాయి. పచ్చి క్యారెట్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది కడుపు నిండిన అనుభూతిని ఎక్కువసేపు కలిగిస్తుంది జీర్ణక్రియ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దీనికి విరుద్ధంగా, క్యారెట్లను వండటం వల్ల పోషకాల శోషణ పెరగవచ్చు మరియు ఆహార విషయాన్ని తగ్గించవచ్చు. పోషకాహార నిపుణులు క్యారెట్లను ఆవిరి పట్టాలని లేదా సగం ఉడికించాలని, వాటి పోషక విలువలు అలాగే ఉండేలా అతిగా ఉడికించకూడదని సిఫార్సు చేస్తున్నారు. చివరికి, క్యారెట్లను తినడానికి ఉత్తమ పద్ధతి వ్యక్తిగత అభిరుచి పోషకాహార అవసరాలపై ఆధారపడి ఉంటుంది. మీరు వాటిని పచ్చిగా ఇష్టపడినా లేదా వండినవి ఇష్టపడినా, మీ ఆహారంలో క్యారెట్లను చేర్చడం మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఒక అద్భుతమైన పద్ధతి.

# ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు షాక్

**ఇండియాను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి తైవాన్!**

**ప్రపంచ స్టాక్ మార్కెట్ ర్యాంకింగ్స్‌లో భారత్ వెనుకంజ**

**ఏఐ, సెమీకండక్టర్ల జోరుతో దూసుకెళ్లిన తైవాన్ మార్కెట్**

**టీఎస్ఎంసీ షేర్ల దూకుడుతో పెరిగిన తైవాన్ మార్కెట్ విలువ**

**విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతో ఒత్తిడిలో భారత మార్కెట్లు**



ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. మార్కెట్ విలువ పరంగా భారత్‌ను అధిగమించిన చిన్న దేశం తైవాన్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా అవతరించింది. బుధవారం ట్రేడింగ్‌తో తైవాన్ మార్కెట్ విలువ 5 ట్రిలియన్ డాలర్లకు చేరువ కాగా, భారత మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.92 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. దీంతో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఈ జాబితాలో అమెరికా (77.95 ట్రిలియన్ డాలర్లు) అగ్రస్థానంలో ఉండగా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.తైవాన్ ఈ ఘనత సాధించడం వెనుక కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల (చిప్) బూమ్ కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ చిప్ తయారీ సంస్థ అయిన 'తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ' (టీఎస్ఎంసీ) షేర్లు గత ఏడాదిలో 130 శాతం మేర పెరిగాయి. ఎన్విడియా, యాపిల్ వంటి టెక్ దిగ్గజాలకు ఏఐ చిప్‌లను సరఫరా చేస్తుండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తైవాన్ మార్కెట్‌పై భారీగా పెట్టుబడులు పెట్టారు.ఇదే సమయంలో భారత మార్కెట్లు పలు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల, రూపాయి క్షీణత వంటి కారణాలతో ఈ ఏడాది సెన్సెక్స్, నిఫ్టీలు 8 శాతం వరకు నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడం కూడా ఒత్తిడి పెంచుతోంది. అయినప్పటికీ, దేశీయ రిటైల్ ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్ ఎస్ఐపీల రూపంలో వస్తున్న పెట్టుబడులు భారత మార్కెట్‌కు అండగా నిలుస్తున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రోజుకు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్న ప్రభుత్వ చమురు సంస్థలు

**అంతర్జాతీయ ధరలు పెరిగినా సామాన్యుడికి ఊరట**

**ఇంధన ధరల స్థిరత్వం కోసం నష్టాన్ని భరిస్తున్న పీఎస్‌యూలు**

**రిటైల్ బంకుల వైపు మళ్లుతున్న పారిశ్రామిక కొనుగోళ్లు**

**అక్రమాలపై కఠిన చర్యలకు రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం**

**దేశంలో ఇంధన కొరత లేదని, పుకార్లు నమ్మవద్దని సూచన**




అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూలు) పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై రోజుకు సుమారు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది.పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగాయి. అయినప్పటికీ, ఆ పెరిగిన ధరలను దేశీయ రిటైల్ మార్కెట్‌కు బదిలీ చేయకుండా వినియోగదారులకు ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ప్రయోజనం కేవలం సాధారణ గృహాలు, ద్విచక్ర వాహనదారులు, రైతుల వంటి రిటైల్ వినియోగదారులకు మాత్రమేనని, పారిశ్రామిక కొనుగోళ్లకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.అయితే, ఈ ధరల వ్యత్యాసం వల్ల కొత్త సమస్య తలెత్తింది. పారిశ్రామిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేసేవారు కూడా తక్కువ ధరకు లభించే రిటైల్ బంకులకు వస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థల డీజిల్ అమ్మకాలు 38 శాతం పడిపోగా, ఆ భారం ప్రభుత్వ రంగ బంకులపై పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇది స్థానిక కొరతకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. 'అత్యవసర వస్తువుల చట్టం' కింద చర్యలు చేపట్టాలని, ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. సామాన్యుల కోసం ఉద్దేశించిన ఇంధనాన్ని పారిశ్రామిక అవసరాలకు మళ్లించవద్దని పరిశ్రమల సంఘాలకు కూడా హెచ్చరికలు జారీ చేసింది.దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలకు ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది. దేశీయ అవసరాలు తీరగా, భారత్ పెట్రోలియం ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఎగుమతి కూడా చేస్తోందని గుర్తు చేసింది. దేశంలో సప్లై సమస్య లేదని, ధరల వ్యత్యాసం వల్ల కొరత ఏర్పడుతోందన్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

# కొత్త బిల్డింగ్ కడుతున్నారా... 2026లో ఇదే కొత్త ఫ్లోరింగ్ ట్రెండ్!

**ప్రీమియం ఇళ్లలో సాధారణ సిరామిక్ టైల్స్ వాడకం తగ్గింది**

**ఫ్లోరింగ్‌ను ఇప్పుడు లగ్జరీ అంశంగా పరిగణిస్తున్నారు**

**జ్యామితీయ డిజైన్లు, టెర్రాజో ఫ్లోరింగ్‌కు పెరుగుతున్న ఆదరణ**

**సీమ్‌లెస్ లుక్ ఇచ్చే మైక్రోసిమెంట్, మార్బుల్ ఇన్లేలకు మంచి డిమాండ్**

**ఫ్లోరింగ్ మన్నికతో పాటు అందానికి ప్రాధాన్యత ఇస్తున్న ట్రెండ్**



రియల్ ఎస్టేట్ రంగంలో ఇంటి నిర్మాణ శైలి వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఫ్లోరింగ్ అంటే కేవలం సిరామిక్ లేదా విట్రిఫైడ్ టైల్స్ మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ, 2026 నాటికి ఈ ట్రెండ్ పూర్తిగా పాతబడింది. ఇప్పుడు ప్రీమియం అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో ఫ్లోరింగ్‌ను కేవలం ఒక ఆవశ్యకతగా కాకుండా, ఇంటికి రాజసం ఉట్టిపడే లగ్జరీ అంశంగా చూస్తున్నారు. అందం, మన్నిక, విభిన్నమైన డిజైన్లకు కొనుగోలుదారులు, డెవలపర్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

**ప్రస్తుతం నాలుగు రకాల లగ్జరీ ఫ్లోరింగ్ ట్రెండ్స్ మార్కెట్‌లో బాగా ప్రాచుర్యం పొందాయి.**

1. వివిధ ఆకృతుల టైల్స్: ఆరు కోణాలు ఉండే టైల్స్, హెరింగ్‌బోన్, చెవ్రాన్ వంటి విభిన్న ప్యాటర్న్‌లతో కూడిన టైల్స్ హాల్, వంటగది, బాల్కనీలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో ఫ్లోర్ రగ్గుల మాదిరిగా వీటిని అమర్చి ఇంటికి కొత్త అందాన్ని తెస్తున్నారు.

2. టెర్రాజో ఫ్లోరింగ్: పాతకాలం నాటి ఈ డిజైన్, ఆధునిక హంగులతో మళ్లీ ముందుకొచ్చింది. చిన్న చిన్న రాళ్ల మిశ్రమంతో నిండినట్లు కనిపించే ఈ ఫ్లోరింగ్ చాలా మన్నికైంది. దుమ్ము, ధూళిని అంత సులభంగా కనిపించనీయదు. భారతీయ వాతావరణ పరిస్థితులకు ఇది బాగా నప్పుతుంది.

3. మైక్రోటాపింగ్/మైక్రోసిమెంట్: ఇది టైల్స్ మధ్య గీతలు (గ్రౌట్ లైన్స్) లేకుండా, మొత్తం ఒకేలా కనిపించే సీమ్‌లెస్ ఫ్లోరింగ్. ప్రస్తుతం ఇది అత్యంత వేగంగా ఆదరణ పొందుతున్న ట్రెండ్. దీన్ని పాత టైల్స్ లేదా కాంక్రీట్ పైన కూడా వేయవచ్చు. ఇది ఇంటిని విశాలంగా, శుభ్రంగా కనిపించేలా చేస్తుంది.

4. మార్బుల్ ఇన్లే: ఆధునిక వాటర్‌జెట్ కటింగ్ టెక్నాలజీతో మార్బుల్‌పై మొఘల్ కాలం నాటి డిజైన్ల వంటి క్లిష్టమైన నమూనాలను చెక్కడం ఇప్పుడు సులభతరమైంది. విల్లాలు, ప్రవేశ ద్వారాలు, పూజ గదుల్లో ఈ ఇన్లే ఫ్లోరింగ్ ఇంటికి సంప్రదాయబద్ధమైన, విలాసవంతమైన లుక్‌ను ఇస్తుంది.

మొత్తం మీద, ఫ్లోరింగ్‌ను ఇప్పుడు ఇంటి విలువను పెంచే ప్రధాన ఆకర్షణగా పరిగణిస్తున్నారు. సాధారణ యూనిఫాం టైల్స్‌కు బదులుగా, ప్రత్యేకమైన డిజైన్లతో కూడిన ఫ్లోరింగ్‌తో ఇంటికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం ప్రస్తుత ట్రెండ్.

# బ్యాంకింగ్ షేర్లు ఢీలా..
# స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు**

**బలహీనపడిన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు**

**142 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**సూచీలు తగ్గినా లాభపడిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు**



బుధవారం నాటి ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను ఆచితూచి అడుగులు వేసేలా చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 141.90 పాయింట్లు నష్టపోయి 75,867.80 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ కూడా 6.55 పాయింట్ల స్వల్ప నష్టంతో 23,907.15 వద్ద ముగిసింది.అమెరికా, ఇరాన్ మధ్య సయోధ్యకు చర్చలు జరుగుతున్నప్పటికీ, మంగళవారం దక్షిణ ఇరాన్‌పై అమెరికా దాడులు చేసిందన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది.టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీకి 23,800 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 23,600-23,500 స్థాయిల వరకు పతనం ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో, 24,000-24,100 శ్రేణి బలమైన నిరోధకంగా ఉందని, దీనిని దాటితేనే బుల్స్ తిరిగి పట్టు సాధించగలరని పేర్కొన్నారు.నిఫ్టీలో ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఎన్టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా లాభపడగా.. టాటా స్టీల్, ఇండిగో, మారుతీ సుజుకీ, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ కూడా లాభాలతో ముగిశాయి. సూచీలు బలహీనంగా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ రాణించడం విశేషం. రంగాలవారీగా చూస్తే ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు నష్టపోగా, మీడియా, మెటల్, ఆటో సూచీలు లాభపడ్డాయి.

# ముంబైలో మండుతున్న అద్దెలు



**సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌కు లక్ష దాటిన రెంట్**

**ముంబైలో సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్న ఇంటి అద్దెలు**

**సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ అద్దె రూ. 28 వేల నుంచి రూ. 1.10 లక్షల వరకు**

**ఆదాయానికి మించి అద్దెలు పెరగడంతో మధ్యతరగతి వర్గాలపై తీవ్ర భారం**

**దేశంలోనే అత్యంత ఖరీదైన రెంటల్ మార్కెట్‌గా ముంబై**

**పెరుగుతున్న డిమాండ్, పరిమిత సరఫరాయే అద్దెలు పెరగడానికి కారణం**

భారత ఆర్థిక రాజధాని ముంబైలో ఇంటి అద్దెలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 2026లో సింగిల్ బెడ్‌రూమ్ (1బీహెచ్‌కే) ఫ్లాట్ల అద్దెలు రికార్డు స్థాయిలో పెరిగి, మధ్యతరగతి వర్గాల ఆదాయానికి, ఇంటి ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని భారీగా పెంచుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే వారికి సొంత గూడు అనేది అందని ద్రాక్షగా మారుతోంది.రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'రియల్టీఎక్స్‌టీ' అందించిన వివరాల ప్రకారం ముంబైలోని ప్రాంతాలను బట్టి సింగిల్ బెడ్రూం ఫ్లాట్ అద్దెల్లో భారీ తేడాలు ఉన్నాయి. సబర్బన్ ప్రాంతమైన భాండూప్‌లో నెల అద్దె సుమారు రూ. 28,000 ఉండగా, కొలాబా వంటి ఖరీదైన దక్షిణ ముంబై ప్రాంతాల్లో ఇది ఏకంగా రూ. 1.10 లక్షల వరకు పలుకుతోంది. బాంద్రా, పరేల్, ప్రభాదేవి, మెరైన్ లైన్స్, దాదర్ వంటి ప్రాంతాల్లోనూ అద్దెలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంధేరీ వెస్ట్, గోరేగావ్, ములుంద్, కాందివలి వంటి సబర్బన్ ప్రాంతాల్లో కూడా అద్దెలు గణనీయంగా పెరిగాయి.నగరంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలు, మెరుగైన రవాణా సౌకర్యాలు, డిమాండ్‌కు తగినంతగా ఇళ్ల సరఫరా లేకపోవడం వంటివి అద్దెలు పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఆస్తుల ధరలు అధికంగా ఉండటంతో చాలామంది ఇళ్లు కొనడానికి బదులు అద్దెకు ఉండేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో రెంటల్ మార్కెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది.దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే, ముంబైలోనే అద్దెలు అత్యంత ఖరీదైనవిగా ఉన్నాయని మార్కెట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అద్దెల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి కొత్త ప్రకటనలు రాలేదు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్




**భారీ ప్లాన్ తో రంగంలోకి బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్!**

**కొంపల్లిలో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ చేపట్టనున్న బ్రిగేడ్**

**5.6 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న ప్రీమియం వెంచర్**

**ఈ ప్రాజెక్టు ద్వారా రూ.850 కోట్ల ఆదాయం అంచనా**

**హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఒప్పందం**

**రాబోయే 3-4 ఏళ్లలో రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్న సంస్థ**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. నగరంలోని కొంపల్లి ప్రాంతంలో 5.6 ఎకరాల స్థలంలో ఒక ప్రీమియం రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.850 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది.ఈ ఒప్పందం కింద, భూ యజమానితో కలిసి బ్రిగేడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. అయితే, భూ యజమాని వివరాలను కంపెనీ వెల్లడించలేదు. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ, హైదరాబాద్‌ను తమ వృద్ధికి కీలకమైన మార్కెట్‌గా పరిగణిస్తోంది. భవిష్యత్తులో కూడా నగరంలో మరిన్ని భూములను కొనుగోలు చేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది.రాబోయే 3-4 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్, కమర్షియల్, హాస్పిటాలిటీ, రిటైల్ ప్రాజెక్టులలో సుమారు రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని బ్రిగేడ్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. 1986లో స్థాపించిన ఈ సంస్థ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, మైసూర్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, విద్యారంగాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

BRIGADE
Building Positive Experiences






## సనాతన ధర్మం, మైథలాజికల్ టచ్‌తో శ్రద్ధాదాస్ 'త్రికాల'

టాలీవుడ్‌లో 'సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రద్ధాదాస్, 'ఆర్య 2', 'గుంటూరు టాకీస్', 'ఏక్ మినీ కథ', 'డిక్టేటర్', 'నాగవల్లి' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు 'త్రికాల'లో మరో విభిన్నమైన పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధిక--శ్రీనివాస్ నిర్మించగా, చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌పీ(ఇఇ్రా) ప్రపంచవ్యాప్తంగా మే 28న విడుదల చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ముఖ్యంగా అడవి నేపథ్యంలో రూపొందించిన విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది కేవలం సాధారణ హారర్ చిత్రం కాకుండా దైవిక శక్తులు, అతీత శక్తుల మధ్య జరిగే సస్పెన్స్‌భరితమైన మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...'ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఒక శక్తి చుట్టూ 'త్రికాల' కథ సాగుతుంది. సనాతన ధర్మంలోని కొన్ని ఆధ్యాత్మిక అంశాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇప్పటికే ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ఇది సరికొత్త అనుభూతిని అందిస్తుంది' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ...'మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల సమ్మేళనంగా రూపొందిన 'త్రికాల' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి 'అర్జున్ రెడ్డి', 'యానిమల్', 'స్పిరిట్' వంటి చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఆయన అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది.

## రామ్ చరణ్‌పై ట్రోలింగ్‌కు జగపతి బాబు కౌంటర్.. అది పనిలేని వాళ్ల పనే అంటూ కామెంట్..

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కు తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు.



జగపతి బాబు మాట్లాడుతూ.. "ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారు" అని అన్నారు.అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. "ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారు" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రామ్ చరణ్‌ను సరికొత్త అవతారంలో చూపించనున్న ఈ స్పోర్ట్స్ డ్రామాపై అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. విడుదలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రమోషన్స్ మరింత జోరుగా కొనసాగుతున్నాయి.



## రామ్ పోతినేని - అనిల్ రావిపూడి క్రేజీ కాంబో ఫైనల్.. దశాబ్దం నిరీక్షణకు ముగింపు

తెలుగు చిత్ర పరిశ్రమలో వినోదం, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అనీల్ రావిపూడి, తన ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరో రామ్ పోతినేని కలయికలో సినిమా వస్తే ఎలా ఉంటుందో అన్న ఆసక్తి అభిమానుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు ఈ ఆసక్తికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ క్రేజీ కాంబినేషన్ త్వరలోనే పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ కాంబినేషన్ చాలా ఏళ్ల క్రితమే సెట్స్‌పైకి రావాల్సి ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి గతంలో తెరకెక్కించిన రాజా ది గ్రేట్ కథను మొదట రామ్ పోతినేనిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేశారట. ఆ కథను రామ్‌కు వినిపించినప్పటికీ, అప్పట్లో వరుస మాస్ యాక్షన్ సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆయన ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లలేదని సమాచారం. తరువాత ఆ కథ హీరో రవితేజ వద్దకు వెళ్లి భారీ విజయాన్ని అందుకుంది. అప్పటి నుంచి రామ్ -- అనిల్ రావిపూడి కాంబినేషన్ ఎప్పుడు సెట్స్‌పైకి వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, అనిల్ రావిపూడి ఇటీవల రామ్‌కు ఒక కొత్త కథా లైన్ వినిపించగా, అది ఆయనకు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, వాటిని పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా ప్రారంభం కానుందని టాక్ వినిపిస్తోంది.అలాగే ఈ చిత్రాన్ని 2027 దసరా సందర్భంగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రామ్ పోతినేని తన కెరీర్‌లో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఆయన కెరీర్‌లో 23వ చిత్రంగా రూపొందనున్న ఇఇ్రా 23 స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ చిత్రంలో రామ్ 'వీర' అనే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

## తనకంటే 21 ఏళ్లు పెద్దవాడైన మిలింద్ సోమన్‌తో బ్రేకప్.. ఎట్టకేలకు నోరు విప్పిన బాలీవుడ్ నటి

ప్రముఖ మోడల్, నటుడు, ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్‌తో తనకున్న పాత ప్రేమాయణం గురించి ఎట్టకేలకు నోరు విప్పింది బాలీవుడ్ నటి షహానా గోస్వామి. ఇటీవల ఒక వీడియో పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె తన రిలేషన్‌షిప్ విషయాల గురించి, మిలింద్‌తో బ్రేకప్ గురించి పంచుకుంది. తాను మొదట్లో మిలింద్‌కు ఒక అభిమానిని అని, ఆ ఆరాధన నుంచి మొదలైన మా ప్రయాణం డేటింగ్ వరకు ఎలా వెళ్లిందో షహానా చెప్పుకోచ్చింది. నాకు 16-17 ఏళ్ల వయసున్నప్పుడు ఢిల్లీలో మిలింద్ నటించిన ఒక సినిమాను చూసి ఆయన మాయలో పడిపోయాను. ఎలాగైనా ఆయనతో మాట్లాడాలని ఇంటర్నెట్‌లో వెతకగా, మిలింద్ ల్యాండ్‌లైన్ నంబర్ దొరికింది. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. పేజర్ మెషీన్‌లో మిలింద్ తన మొబైల్ నంబర్‌ను వదిలివెళ్లారు. ఆ నంబర్‌కు షహానా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ చేయగా, మిలింద్ వెంటనే స్పందించారు. అయితే, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు వారిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోలేదు, కేవలం మెసేజ్‌ల ద్వారానే టచ్‌లో ఉన్నారు. కాలేజీ చదువుల కోసం షహానా ముంబైకి వచ్చిన తర్వాత, ఇద్దరూ సింగిల్‌గా ఉన్న సమయంలో మళ్లీ కలిసి డేటింగ్ ప్రారంభించారు. మిలింద్ సోమన్‌తో డేటింగ్ చేసే సమయానికి ఆతడి వయసు 43 ఏళ్లు కాగా, షహానా 20లలో ఉంది. అయితే వీరి డేటింగ్‌పై అప్పట్లో విమర్శలు రాగా.. దీనిపై షహానా స్పందిస్తూ.. నేను ఆ వయసు తేడాను ఎప్పుడూ గుర్తించలేదు. నా వయసు కంటే నేను చాలా ఉన్నతంగా ఆలోచించేదాన్ని. మా కుటుంబంలో కూడా అందరం స్నేహితుల్లా ఉంటాం కాబట్టి ఈ విషయం ఇంట్లో చెప్పడానికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు అని పేర్కొన్నారు. ఇక 2013లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాన్ని షహానా బయటపెడుతూ.. చివరి క్షణం వరకు మా ఇద్దరి మధ్య ఎంతో ప్రేమ ఉంది. కానీ కొన్నిసార్లు బంధాలు అనుకున్నట్లు సాగనప్పుడు వాటిని వదిలేయడమే మంచిది. నేను సాంప్రదాయ బంధాలలో ఇమడలేనని నాకు అర్థమైంది. నేను ప్రేమిస్తాను, కానీ స్వేచ్ఛను అంతకంటే ఎక్కువగా కోరుకుంటాను. ఒకరిని బంధించి ఉంచడం ప్రేమ అనిపించుకోదు. మా ఇద్దరి ఆలోచనలు వేరుగా ఉన్నాయని, భవిష్యత్తుపై మా అంచనాలు కలవడం లేదని గ్రహించి పరస్పర అంగీకారంతోనే విడిపోయాం అని షహానా చెప్పుకొచ్చారు.



PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com